# చెరగని దృశ్యం

రచన : మార్గాన మహేశ



మాది గ్రామంకాదు. అంటే పట్టణమన్నమాట. పట్టణంలోవున్న అనేకవీధులలో మావీధి ఒకటి. అందులో మా ఇల్లొకటి. మాది డాబాయిల్లు. ఏమీ తోచనప్పుడల్లా డాబామీదికి వెళ్ళడం నాకలవాటు. అలాగే ఒకరోజు డాబామీదికివెళ్ళి, డాబా గట్టుమీద కూర్చున్నాను, చేత కొన్ని కాగితాలుకూడా తీసుకెళ్ళాను ఎందుకైనా మంచిదని. పెన్ను ఎప్పుడూ ఫేంటు జేబుకు అంటుకునేయుంటుంది. ఆసమయంలో నా మనస్సులో అంటే నా మెదడులో ఎంత వెదకినా ఏ ఒక్క ఆలోచనా కనిపించదు. అంత నిర్మలంగావుంది నా మనస్సు. ఎప్పుడోగాని నామనస్సు అంత నిర్మలంగావుండదు. అంత నిర్మలంగావున్నపుడు ఏదో ఒక చిన్నకథైనా వ్రాసేస్తూంటాను. ఆవేళకూడా ఒక కథ వ్రాద్దామనే అనుకున్నాను. కాని కథ ఎలా మొదలుపెట్టాలి. దేనిగూర్చి వ్రాయాలి అన్నప్రశ్నలకు జవాబులు దొరకడం లేదు. ఒకసారి చుట్టూ చూశాను 'ఛీ! ఈపట్నంలో పొరపాటున పుట్టాను నేను' అనుకున్నాను. ఇదే యే గ్రామంలోనో ఐతే ఎటుచూసినా పచ్చని పైరులు, ఎత్తైన తాటిచెట్లు, పచ్చని పంటలమధ్యగా పోయే ఎర్రని మట్టిరోడ్లు, ఆరోడ్లమీద అప్పుడప్పుడూ పోయే ఎడ్లబండ్లు, ప్రతీ మడినీ కలుపుతూపోయే చిన్నచిన్న పంటకాల్వలు, కాల్వల్లో చేపలగూర్చి కాచుక్కూర్చునే కొంగలూ, అహ్! నిజంగా సౌందర్యమంతా గ్రామాలలోనే ఉంది అనుకున్నాను. అలాంటిగ్రామంతో మా పట్టణాన్నొకసారి పోల్చి చూచుకున్నాను. ఎటు చూచినా ఇరుకుసందులు, అక్కడక్కడ ఎత్తుగా కనిపించే మేడలు, మనుష్యుల గోల, వాహనాల గోల, అంతకంటే ఏముందీపట్నంలో అని ప్రశ్నించుకున్నాను మనస్సులోనే. ప్రశ్న నేను వేసుకున్నదే గాబట్టి నేను సమాధానం చెప్పుకోనవుసరంలేదు కూడాను.

'ఈవేళ కథేం వ్రాసేటట్టు లేను' అనుకుంటూ మళ్ళీ ఒకసారి అటూ ఇటూ చూశాను. కొన్ని పెంకుటిల్లు, కొన్ని డాబా యిల్లు, కొన్ని మేడలూ–అంతకంటే ఇంకేం కన్పిస్తాయి! ఆ డాబా ఇళ్ళమధ్యలోనున్న కూలిన భవనం నాదృష్టి నాకర్షించింది. ఆ కూలినమేడ నన్ను ఆకర్షించడం, నేను దాన్నిచూస్తూ గంటలతరబడి ఆలోచనలలో మునిగిపోవటం మామూలైపోయింది. అలా చూస్తూన్నకొలదీ నాకళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

* * * *

రామిరెడ్డిగారు మాపట్నానికి పాతికమైళ్ళదూరంలోనున్న పల్లెటూరిలో మోతుబరి. ఆయన సతీమణి జానకమ్మ. ఒక్కగానొక్క కొడుకు రామం హైస్కూల్లో చదువు పూర్తిచేశాడు. తల్లిదండ్రుల కిష్టంలేకపోయినా కాలేజీకి దరఖాస్తు పెట్టాడు. అనుకోకుండానే సీటు కూడా రావడంతో తల్లిదండ్రులను ఒత్తిడి చేశాడు. వాళ్లుకూడా రామం మాట కాదనలేకపోయారు.

జానకమ్మకు పట్నంరావడం సుతరామూ ఇష్టం లేదట. 'పట్నం అంటే మోసాలగూడు. దొంగలకు పుట్టిల్లు. పట్నంలో ఉండటం అంటే మాటలా! హాయిగా గడుస్తున్న మన సంసారాన్ని నడివీధులపాలు చేసుకోమంటారేమండీ! రామం చదవకపోతేనేం. ఇప్పుడు

చదివింది చాలదా. మన ఆస్తి చాలదా వాడొక్కడి బ్రతుక్కి' అని ఎన్నో అడ్డంకులు చెప్పింది జానకమ్మ. కాని రామిరెడ్డిగారు 'మనం మంచిగావుంటే మనల్నెవరు మోసం చేస్తారు? అంతా నీ చాదస్తం' అంటూ ఎలాగో ఒప్పించ ప్రయత్నించారు జానకమ్మను.

పాలేరు రామన్న కీవిషయం తెలిసినవెంటనే పరుగెత్తుకుంటూ వచ్చాడట. పాపం! ఆ అమాయకుడు ఎన్నాళ్లనుండో రెడ్డిగారినే నమ్ముకొని బ్రతుకుతున్నాడు. ఒక్కసారిగా తనకున్న ఈ ఆధారం కాస్త పోయిందంటే చేంతాడంతవున్న కుటుంబాన్ని ఎలా పోషించగలడు? 'బాబుగారూ! చినబాబు చదువుకు పట్నంవెళ్ళిపోతున్నారటగా బాబూ, నిజమేనా?' అని తను విన్నది నిజమా, కాదా అన్నట్లు నోరు వెల్లబెట్టి ప్రశ్నించాడు.

'ఔన్రా రామన్నా, నేనెంతచెప్పినా అయ్యగారు వినటం లేదురా, నువ్వైనా చెప్పిచూడరా, ఈయనకూడా పట్నంపిచ్చి పట్టుకుందిరా, ఇదంతా మన ఖర్మరా ఖర్మ. లేకపోతే వాడొక్కడికి చదువుకు అందరం వెళ్ళిపోటం ఎందుకు చెప్పు.'

'ఏవేఁ జానకీ, నీకు మతిగాని చెడిందేంటి? శుభమా అని రామంగాడి చదువుకని పట్నం వెళ్తుంటే, ఖర్మ అంటావేమే.'

'ఎందుకా? ఆ గోపాల్రావుసంగతి తెలీదూ, ఉన్న ఐదు యెకరాలూ అమ్మేసి సందడిచేసుకొంటూ పట్నం వెళ్ళాడా, నెలరోజులు తిరిగేసరికి బికారిలా తయారై రిక్షా లాక్కునే స్థితికొచ్చాడట, తెలీదూ? నిజం చెప్పండి పట్నంలో ఉండాలనే తహతహ మీకు లేదూ?'

'ఔను బాబుగారూ, గోపాల్రావు బాబుగారిక్ త్రాగుడు మప్పేసి డబ్బంతా లాగేసుకున్నారట బాబూ, మీరు పట్నం ఎళ్లకండి బాబుగారూ, నామాటినండి బాబుగారూ' అంటూ ఎన్నోరకాల పిరికిమందులు వేశారు. కాని రెడ్డిగారు తన పట్టుదలమాత్రం విడవకుండా మూటాముల్లే సర్దుకొని పట్నం వచ్చేశారు. రెడ్డిగారి పేరునవున్న ముప్పై యెకరాలభూమిని, ఇల్లునూ అమ్మేశారు. జానకమ్మమాత్రం తనపేరునవున్న ఐదు యెకరాల మాగాణీ అమ్మటానికి ఒప్పుకోలేదు. ఎప్పటికైనా అవే శరణ్యమౌతాయని ఆవిడ నమ్మకం.

ఆ ఐదెకరాలూ పాలేరుకు ఒప్పజెప్పి సంవత్సరానికి కొంతభాగం తీసుకొనే ఏర్పాట్లుచేసి పట్నం బయలుదేరారు. ఎలా అయితేనేం చివరికి తనపంతమే నెగ్గించుకున్నారు రెడ్డిగారు.

పట్నంలో నలుగురైదుగురు పెద్దలను పట్టుకొని వాళ్లనే నమ్ముకుని ఒక చిన్నరకంమేడ కట్టించారు భారం అంతా వాళ్ళమీదే పెట్టారు. మేడ పూర్తయింది మకాం మార్చేశారు.

ఆవేళ గృహప్రవేశం. అందరితోపాటు రామంకూడా హడావుడిగా ఉన్నాడు. వాళ్ళ ఊరివాళ్లుకూడా కొంతమంది వచ్చారు. దేనిగురించో వెతుక్కుంటూ మా ఇంటి ప్రక్కగా వస్తున్నాడు రామం. అప్పటికి మాఇద్దరికీ పరిచయమే కాలేదు. ఇద్దరం ఒకేక్లాసువాళ్ళం. ఒకే డివిజన్ వాళ్ళం. ఐనా ఐదునెలలు కావస్తున్నా ఒక్కసారీ మాట్లాడుకోలేదు. నేను ఎక్కడికో బయలుదేరుతూ ఇంటిగుమ్మంవద్ద నుంచుండగా రామం అటుపోతూ నన్ను [illegible] రుపట్టాడు.

మా హృదయపూర్వకమైన
దీపావళి అభినందనలు !!



'మీరు మా క్లాసే కదూ!' అని అతనే అడిగాడు.

'దేన్నిగురించో వెదుకుతున్నట్లున్నారు' అని అడిగాను. అతనే చెప్పాడు ఆవేళ గృహప్రవేశ మనీనూ, దగ్గర్లో కిరాణాకొట్టునుంచి చూస్తున్నట్లూను. నేనూ అతనితోపాటు బయదేరాను. గృహప్రవేశానికి కూడా వెళ్లక తప్పలేదు.

అలా మొదలయిన మా స్నేహం ఒకర్ని విడిచి ఒకరం ఉండలేనంత సన్నిహితులమయ్యాము. ఎక్కడికివెళ్ళినా ఇద్దరం కలసే వెళ్లేవాళ్ళం. ఏ పనిచేసినా కలసే చేసే వాళ్ళం.

మా స్నేహానికి వయస్సు పెరిగింది. నాలుగోసంవత్సరం మొదట్లో ఉంది. అంటే ఇద్దరం ఫైనల్ ఇయర్ కొచ్చామన్నమాట.

ఆరోజు ఇద్దరం కాలేజినుండి వచ్చేస్తున్నాం. ఎందుచేతనోకాని రామం ఆవేళ చాలా హుషారుగావున్నాడు మాకు రెండడుగులదూరంలోనే ఒకమ్మాయి పోతూంది ఆ అమ్మాయి పి. యు. సి. చదువుతుంది. ఆమెనడక అందంగా, వయ్యారంగా వుంది. రామం అప్పటినుండి మొదలుపెట్టాడు 'ఆమె సౌందర్యవర్ణన'. చేతిలోనున్న చిన్న కాగితంముక్కను రాకెట్టులా చేశాడు. విసరటానికిముందు చాలాసేపు తటపటాయించాడు. ఎలా అయితేనేం, ఆరాకెట్టు ఆమెపై విసిరాడు. అది వెళ్ళి ఆమెజుట్టులో గ్రుచ్చుకుంది. అప్పుడే నేనన్నాను. 'ఒరే రామం నువ్వా పెద్దవాడి వౌతున్నావురోయ్' అని. అప్పుడు వాడన్నాడు, 'ఇంకా ఎన్నాళ్లు చిన్నపిల్లవాడిలా ఉండమంటావురా!' అని.

'ఆ అమ్మాయి నడకచూడు ఎంత అందంగా ఉందో! జడ చూడు ఎలా ఊగుతోందో' అన్నాడు రామం. నేనింకే మనగలను. వాడు చెప్పినదానిలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.

ఆరాకెట్టును ఆమె గమనించినట్టు లేదు. ఇంకా ఆమె తలలోనేవుంది రాకెట్టు! అదిచూచి మాకు నవ్వు ఆగడం లేదు. నవ్వుతూ ముందుకెళ్తున్నాం మేము. కాని ఆమె సడన్ గా ఆగిపోటంచే ఆమెను ఢీకొట్టేంత పనిచేశాం.

'ఏయ్, మిష్టర్, కళ్ళు కనపట్లా?' అని కయ్యానికి కాలు దువ్వింది.

'కళ్ళు కనబడంది మాక్కాదు, మీకు' అని తకీమని సమాధానం చెప్పాడు రామం. అతని సమాధానం విన్న నాకు నిజంగా ఆశ్చర్యం వేసింది.

'ఔనండీ, మీతలలో ఏముందో ఒక్కసారి చూచుకోండి' అన్నాను నేను.

ఆ రాకెట్టుతీస్తూ, 'ఏమండీ రామంగారూ, మీరే కదూ ఈరాకెట్టును షూట్ చేసింది'' అని అడిగేసరికి రామం నివ్వెరపోయాడు.

'ఆశ్చర్యపోకండి, మీ పేరు వాసుదేవరావు కదూ?' అని నా పేరుకూడా చెప్పేసరికి నేనూ నిర్ఘాంతపోవలసి వచ్చింది.

'అలా ఆశ్చర్యపోకండి, మీ క్లాస్ మేట్ నాకు స్నేహితురాలు. ఆమె చెప్పింది ఏదో సందర్భంలో. మీకు సెకండ్ ఆయర్ పరీక్షల్లో క్లాసుకూడా వచ్చిందటకదూ' అంటూ అన్నీ ఆమె చెప్తుంటే మేమీ ప్రపంచంలో ఉన్నట్లు మర్చిపోయి విన్నాం.

అప్పుడు రామం అందుకొని 'మీ పేరు వజన కదూ? అనడిగాడు తనేదో పెద్ద రహస్యం కనుగొన్నట్లు.

'ఓహో! ఈ పుస్తకం నా ఫ్రండుది డీ! నా పేరు లత' ఆ డిస్సపాయింట్ మెంటుతో రామం మొహం చిన్నదైపోయింది. అలా మొదలయింది లతతో మా పరిచయం. తరువాత రామం, లతలమధ్య స్నేహం బాగా పెరిగింది. క్రమంగా వాళ్ళమనసులు కలిశాయి.

ఒకనాడు రామం నాదగ్గరకొచ్చి, 'ఒరే వాసూ, మాకిప్పుడేదో ఒకవుపాయం ఆలోచించి పెట్టాలా.'

'దేన్నిగురించి' అని నేనడిగాను.

'ఏం తెలియనట్టే యాక్టుచేస్తున్నావురా, మామారేజి సక్సెస్ ఫుల్ గా జరిపించేబాధ్యత నీదిరా.'

'అది సరేగాని అబ్బాయ్, పరీక్షలు నెలరోజులే ఉన్నాయి. అప్పటివరకు అలాంటి ఆలోచనలేం పెట్టుకోకు' అని ఆదేశించాను నేను.

'ఐనా యిప్పుడు మీకొచ్చిన ఆటంకం యేమిటి?' నేనే అడిగాను మళ్ళీ.

'మరేంలేదు. వాళ్ళన్నయ్య సత్యంగారి నొప్పించినట్లయితే మనకే బాగాలేదు.'

ఏసత్యం, రైల్వేలో టి. సి. గా పనిచేస్తున్నాడు, వాడేనేంటి?'

'శభాష్! ఐతే నీకు తెలుసన్నమాట! పదపద స్వీట్సు తీసుకుందాం' అంటూ హోటల్ కు తీసుకుపోయాడు.

పరీక్షలై పోయాయి. మా ప్రయత్నాలకు ప్రారంభోత్సవం జరిగింది. రామాన్ని సత్యానికి పరిచయంచేశాను. తరచు ముగ్గురం కలుస్తూండేవాళ్ళం. తరువాత కొన్నాళ్ళకు అసలువిషయం బయటపెట్టాం. సత్యం మనస్ఫూర్తిగా అంగీకరించాడు. ఇక మిగిలింది రెడ్డిగారు. అంటే రామంతండ్రి. ఆయన లతనుచూచి సంబరపడిపోయాడు. జానకమ్మసంగతి చెప్పక్కర్లేదు. కాబోయే కోడల్ని చూచి మురిసిపోయిందావిడ.

పరీక్షలయిన మూడునెలలకు లత, రామంల వివాహం వైభవంగా జరిగింది.

తరువాత ఒకరోజు రామిరెడ్డిగారు భార్య జానకమ్మతో అంటూంటే విన్నాను: 'చూశావా పట్నం అంటేనే బెంబేలెత్తిపోయావ్; రామం చదువు పూర్తయింది. ముచ్చటైనకోడలు దొరికింది. పట్నం మోసాలకు మారుపేరన్నావు, మనం మంచిగావుంటే మన కెవ్వరు మోసంచేస్తారు చెప్పు. మన ఊరంతా వెదికినా 'లత'లాంటిపిల్ల నీకెక్కడైనా దొరుకుతుందా?' ఆనందోత్సాహంతో అంటూన్న మాటలవి. జానకమ్మ నోరు మెదపలేదు.

* * *

మంచిచెడుల అంతర్యుద్ధంలో మొదటివిజయం చెడు (అజ్ఞానం)దే కావచ్చు. ఆ విజయంయొక్క ఫలితాలు ఒక క్లయిమాక్స్‌కు వచ్చేవరకూ అది 'చెడు' అని తెల్సుకోలేం. ఆతరువాత ఎదురయ్యే దుష్ఫలితాలు జ్ఞాపకం చేస్తాయి. మంచి (వివేకం)యొక్క విలువల్ని చివరికి తెల్సుకుంటారు, అంతిమవిజయం వివేకానిదే అని.

రామిరెడ్డిగారు తీసుకున్న అజ్ఞానపు టాలోచనా ఫలితంగా అప్పటివరకూ ఎట్టి అడ్డంకులూ కలుగలేదు. పట్నం అంటే స్వర్గసీమనుకున్నారు. దాని ననుభవిద్దామనుకున్నారు. బయులుదేరారు పట్నం.

మరొక విజయంకూడా లభించింది. వివాహమైన వారంరోజుల్లోనే రామంకు ఎంప్లాయ్‌మెంటుద్వారా ఇంటర్వ్యూ వచ్చింది. కష్టంలేకుండనే సెలక్టు అయిపోయాడు. వారంరోజుల్లో జాయిన్ అవ్వాలంటూ

WISH YOU HAPPY DEEPAVALI

IDEAL PUMPS Ideal MOTORS



O
INSTAL
FOR
MORE WATER
AND
BUMPER CROPS
O



To Meet The Needs of Agriculture & Industry
"IDEAL" The Most Trusted Name in Pumps & Motors.

For Particulars:

Phone :-32407

IDEAL ENGINEERING INDUSTRY
GANAPATHI (P.O.) : : COIMBATORE-6.

లెటర్ వచ్చింది. 'రామం అదృష్టవంతుడు' అని పొంగిపోయాను నేను. 'అంతా కోడలు వచ్చిన వేళావిశేషం' అనుకున్నారు రెడ్డిగారు, జానకమ్మగారూను.

రామం ఆఫీసులో చేరిపోయాడు. అతనిలో క్రొత్త కళ కన్పిస్తుందేది. అప్పట్నుంచీ రోజుకు ఒక్కసారే కలుస్తూండేవాళ్ళం. పదిహేనురోజులిలా గడచిపోయాయి.

తరువాత ప్రారంభమైంది తుఫాను. రెడ్డిగారు తీసుకున్న అవివేకపునిర్ణయానికి దుష్ఫలితాలు ప్రారంభమయ్యాయి.

ఆవేళకు వారంరోజులనుండి వర్షం ఒకటే హోరుగ ఉంది. ఏ పేపరుచూచినా వరదబాధితులు,నిరాశ్రయులు అన్నమాటలే. అలాంటి తుఫాను ఇంతకుముందెప్పుడూ రాలేదట. ఇరవైసంవత్సరాలక్రితం వచ్చిందని మా నాయనమ్మ చెప్పింది. రెండురోజులనుండీ వర్షం ఒక్క నిమిషంకూడా ఆగకుండా కురుస్తూంది. చుట్టుప్రక్కల పల్లెటూళ్ళలో పొలాలు, యిల్లు, గొడ్లు కొట్టుకుపోయాయట. వాళ్ళంతా ఎలాగో ఈఊరు చేరుకున్నారు ప్రాణాలమీద తీపితో. ఈ ఊళ్ళోకూడా ఎక్కడచూచినా యిల్లూ, చెట్లూ, ఎలక్ట్రిక్ స్థంభాలు పడిపోయి భీభత్సంగా ఉంది.

పై వాతావరణం ఎలావున్నా నేనుమాత్రం కాశ్మీరు శాలువ కప్పుకొని హాయిగా పడుకున్నాను. ఆవేళ అర్థరాత్రి గభాలున తెలివివచ్చింది. లేచి టైం చూచుకున్నాను. పన్నెండున్నర కావస్తోంది. మనస్సెందుకో భీతిగా ఉందావేళ. నెమ్మదిగాలేచి కిటికీదగ్గరకెళ్ళాను. చప్పుడుకాకుండా కిటికీతలుపు తెరచాను. తలుపు తెరచేసరికి హోరుమంటూ చల్లనిగాలి మొహాన్ని కొట్టింది. 'అబ్బ' అనుకున్నానొక్కసారి. అంతా అంధకారం. వీధంతటికీ ఒక్క లైటైనా లేదు. వర్షం ఉధృతం ఏమీ తగ్గలేదు. మనుష్యసంచారం అస్సలులేదు. మనస్సులో ఎంచేతో భయంగా, ఆందోళనగా ఉం . నీరు వీధుల్లో వరదలా పారుతూంది. కాలువలు, రోడ్లు అన్నీ కలిసిపోయేయి. ప్రళయకాలం ఆసన్నమౌతూందేమో నన్నంత విపరీతంగా వుంది. ఆ ఈదురుగాలి విలయతాండవమాడుతూ చేస్తూన్న భయంకరధ్వని ఇప్పటికీ చెవుల్లో గీపెడుతూంది.

'రామం ప్రపంచాన్ని మరచి నిద్రపోతూంటాడు' అనుకున్నాను. అంతలో ఎక్కడనుండో సన్నగా రోదన నాచెవిని పడింది. ఎటునుంచి వస్తున్నది తెలియడంలేదు. వెంటనే టార్చిలైటు తీసుకొని, తలుపుతెరచి, రోడ్డుమీదికి చేరాను. ఎవరో అటు కంగారుగా పరుగెడుతూంటే ఆపాను. 'ఏం జరిగింది' అని అడిగితే చెప్పాడు అటుప్రక్క మేడ కూలిపోయిందని. వెంటనే అటు పరుగెట్టాను. ఇంకేముంది ఆ మేడ రెడ్డిగారిదే!

జనం హడావుడిగా అటూయిటూ పరుగెడుతున్నారు. మనుష్యులను రక్షించాలని కొందరు చూస్తూంటే, దొరికినవల్లా యింటికి చేర్చేపనిలో మరికొందరు నిమగ్నులయ్యారు. వర్షాన్ని లెక్కచేసేపరిస్థితిలో లేదు. అప్పటికే రెడ్డిగారు, జానకమ్మ దెబ్బలుతగులుటవలన స్పృహతప్పారు. కొందరు వాళ్ళని హాస్పిటల్‌కు చేర్చారు. రామం దంతుల ఆచూకీ తెలియనల్లేదు. మరికొంత సేపటికి వాళ్ళ శవాలుమాత్రం దొరికాయి. పెళ్ళయి నెలరోజులుకూడా కాలేదు. అంతలోనే ఈ దుర్ఘటన. నాకేం చెయ్యాలో తోచలేదు. హృదయం బాధతో మూల్గింది. గుండెల్ని చీల్చేస్తుంది దుఃఖం. శరీరం చలితోను, మనస్సు వేదనతోను వణికేయి. ఒక్కక్షణం వదలి ఉండలేని స్నేహితులం. శాశ్వతంగా విడిపోయాం ఎప్పటికీ కలవలేనంతదూరం మామధ్య ఏర్పడింది.

లత తల్లిదండ్రులయేడ్పులు వినేకొద్దీ గుండెలు ముక్కలు కాజొచ్చాయి. సత్యంగాడు చిన్న పిల్లడికంటే అధ్వాన్నంగా రోధించాడు.

చాలా సేపటివరకూ నేనీలోకాన్న ఉన్నధ్యాసే లేదు. తర్వాత విన్పించాయి. ప్రక్కనున్నవాళ్ళు అనుకొంటున్నమాటలు.

'ఆ కంట్రాక్టరు నాయుడుబాబు కట్టిస్తున్నప్పుడే అనుకున్నాను. ఇలాంటిదేదో ఔతుందని.'

'పదిసంవత్సరాలయినా ఐందిరా ఇది కట్టించి?'

'అబ్బే ఏదీ ఇంకా ఐదు సంవత్సరాలయినట్టులేదు.'

'ఎంత తుఫానయితేమాత్రం, కట్టించిన ఐదు సంవత్సరాలికే పడిపోవడం...

'కంట్రాక్టరెవరోగాని రెడ్డిగార్ని బాగా మోసం చేశారండీ!'

'ఈ మేడకు కంట్రాక్టరు నాయుడుకదూ. ఇలా చెయ్యబట్టే ఈఊరిలో మూడు మేడలు కట్టించగలిగేడు.

'పచ్చని పొలాన్ని అమ్ముకొని పట్నమో అని ఎగబడినందుకు బలేశాస్తి జరిగిందిలే.'

'పాపం, కొడుక్కి ఏదో ఆఫీసులో ఉద్యోగంకూడా వచ్చిందట. ఇంకా జాయిన్ అయ్యి నెలరోజులుకూడా కాలేదు, ఇలా జరిగింది. విధివ్రాత ఎవ్వరు తప్పించగలరు.

'ద్వారాలకు కట్టినతోరణాలు ఇంకా ఎండనేలేదు, వీళ్ళజీవితాలుమాత్రం అప్పుడే ఎండబారిపోయాయి.'

ఈ సానుభూతుల్ని, వ్యాఖ్యానాల్ని వింటున్నకొద్దీ మనస్సు జాలి, ఆవేదనలతో నిండిపోయింది. ఇక వాటిని వినలేక రెడ్డిగారి కెలాగుందోనని హాస్పిటలుకు వెళ్ళాను. అప్పుడే ఆయనకు తెలివివచ్చింది. అక్కడక్కడా దెబ్బలు తగిలాయి. మరికాస్సేపటికి జానకమ్మకి తెలివి వచ్చింది.

'జానకీ, నీమాట విననందుకు చూశావా, చూశావా, ఎంతశిక్ష పడిందో. జానకీ! ఇది పట్నంకాదు జానకీ! నమ్మించి గొంతుకోసేవాళ్ళకు నిలయం. మోసాలగుట్ట. పద జానకీ పద. మనం ఇక్కడుండొద్దు. ఎవరిగురించైతే వచ్చామో వాళ్లే మనల్ని విడిచిపోయినప్పుడు మన కెందుకు జానకీ!...'

'ఆఁ! నాబాబు పోయాడా, నాబాబు చనిపోయాడా!' అంటూ రోధిస్తున్న ఆతల్లిని చూడలేకపోయాం.

రెండురోజులు హాస్పిటలులోనే ఉన్నారు. మూడవ రోజు లత తండ్రి శంకరయ్యగారింట్లో ఉన్నారు. నాల్గవ నాడుసాయంత్రం నేను డాబామీదికెళ్ళి కూలిన ఆ మేడనుచూస్తూ పాతజ్ఞాపకాలను త్రవ్వుకొంటున్నాను. అంతలో రెడ్డిగారు భార్యతోసహా వెళ్ళిపోవడం చూశాను. అప్పటికే చాలాదూరం వెళ్ళిపోయారు.

కళకళలాడుతున్న ముఖంతో వచ్చిన రెడ్డి దంపతులు కన్నీరు కార్చుకొంటూ వెళ్ళారు. రెండుబండ్ల సామానులతో వచ్చినవాళ్లు ఒక చిన్న పెట్టెతో పయనమయ్యారు. వచ్చినపుడు ముగ్గురు వచ్చారు. కొన్నాళ్లకు ముగ్గురు నలుగురయ్యారు. కాని వెళ్ళేటపుడు నలుగురు యిద్దరయ్యారు.

ఇప్పటికీ వాళ్ళింకా వెళ్తూన్నట్లే కనిపిస్తూంది నా కళ్ళకు. ఆదృశ్యం నా మనోఫలకంమీద ముద్రితం అయిపోయింది. ఎంత ప్రయత్నించినా చెరగనిదృశ్యం అది.

---

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులముకాదు. —సంపాదకుడు.

Trade Mark Regd No: 243795

PONMANI

• శ్రేష్ఠమైన రకం
• తక్కువ ధర
• చిరకాల మన్నిక
• చక్కని అల్లిక
ఇవే



పొన్‌మని బనియన్ల విశేషత

(ఏజెంట్లు లేని ఊళ్ళో ఏజెంట్లు కావలెను)

: వివరములకు :

పొన్‌మని నిట్టింగ్ కంపెని
పి. ఎన్. రోడ్డు : : తిరుపూరు.

PONMANI KNITTING CO.,
P. N. ROAD :: TIRUPUR (SI)